

మంత్రి సీతక్కతో ఈజీఎస్ జిల్లా జేపీసీ అధ్యక్షుడు నవీన్‌కుమార్

ఉపాధి హామీ సిబ్బందికి పే స్కేల్ అమలు చేయండి

వికారాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తమకు నెలనెలా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఈజీఎస్ జిల్లా జేపీసీ అధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 511 మంది ఈజీఎస్ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు లేక తమ పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేని దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆయన ఈ విషయాన్ని హైదరాబాద్‌లో మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. ఈజీఎస్ ద్వారా చేపట్టే ప్రతీ పనిని అంకితభావంతో చేపడుతున్నా నెలనెలా వేతనాలకు నోచుకోకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ సిబ్బందికి పేస్కేల్ వర్తింపజేయాలని, నెలనెలా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు.



పవిత్రమాలలు తీసుకెళ్తున్న అర్చకులు

వైభవంగా పవిత్రమాల సమర్పణ



పూజా కార్యక్రమాల్లో భక్తులు

కొడంగల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం స్వామివారికి పవిత్ర మాల సమర్పణ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలను పురోహితులు నిర్వహించారు. పవిత్రమాలలను ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీవారి మూలవిరాట్, ఉత్సవమూర్తులు, భోగ శ్రీనివాసమూర్తి, ఉగ్ర శ్రీనివాసమూర్తి, విష్వక్సేనులు, విమాన వేంకటేశ్వరస్వామి, శ్రీమహాలక్ష్మి, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని ధ్వజస్తంభానికి, బలిపీఠానికి, గరుడునికి, నవగ్రహాలు, ఆళ్వార్లు, శ్రీ అన్నపూర్ణ దేవి, శ్రీ విఖాసనచార్యులు, శ్రీ వరహాస్వామి, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ వినాయక స్వామి, శ్రీ నాగదేవత, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, దేవాలయ గోపురాలకు పవిత్ర మాలలను సమర్పించారు. అలాగే, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పవిత్రోత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పురోహితులు పాల్గొన్నారు.

23న విద్యాసంస్థలు బంద్ : పీడీఎస్‌యూ

వికారాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా సమస్యల పరిష్కారానికి రేపు(23వ తేదీన) రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేశ్ తెలిపారు. ఆయన వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టేలా చట్టం తేవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని వెంటనే నియమించాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్‌లో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో బొజ్జి శ్రీకాంత్, శేఖర్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త రేషన్ కార్డులకు మోక్షం

25వ తేదీ నుంచి మండలాల వారీగా పంపిణీకి ప్రభుత్వ ఆదేశాలు

కొత్త రేషన్‌కార్డుల కోసం గత పదేళ్లుగా ఎదురు చూస్తున్న పేదల కల ఎట్టకేలకు సాకారమైంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా వికారాబాద్ జిల్లాలో 14,700 రేషన్ కార్డులు మంజూరు చేసింది. ఈ కార్డుల్లో 58,800 మందిని సభ్యులుగా చేర్చారు. అలాగే మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 93,603 మంది దరఖాస్తు చేసుకోగా 28,818 కొత్త కార్డులు మంజూరయ్యాయి. కాగా, ఉమ్మడి జిల్లాలో 25వ తేదీ నుంచి మండలాల వారీగా కార్డుల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

- వికారాబాద్ జిల్లాకు 14,700 మేడ్చల్‌కు 28,818 కొత్త కార్డులు మంజూరు
- కార్డుల్లో 58,800 మంది కొత్త సభ్యులు చేరిక
- సెప్టెంబరులోనే లబ్ధిదారులకు అందనున్న సన్నబియ్యం
- ఉమ్మడి జిల్లాలో 15 రోజుల పాటు జరగనున్న పంపిణీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

వికారాబాద్/మేడ్చల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాలో గత జనవరి 26న శ్రీకారం చుట్టి మండలంలో ఒక గ్రామం వంతున జిల్లాలో 20 మండలాల్లో 20 గ్రామాల్లో 719 కుటుంబాలకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కాగా, జూలై 17వరకు జిల్లాలో మరో 14,700 రేషన్ కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్డుల్లో కొత్తగా 58,800 మందిని సభ్యులుగా చేర్చారు. ఈ ఏడాది ప్రారంభంలో జిల్లాలో 2,41,169 రేషన్ కార్డులు ఉండగా, వాటిలో 8,08,896 మంది కుటుంబ సభ్యులుగా ఉన్నారు. వారికి నెలకు 5,335.597 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేశారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలుగా జిల్లాలో బియ్యం తీసుకోని 2,218 మంది కార్డుదారులను గుర్తించిన సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపించగా, వారిలో 1,300 కార్డుదారులను అనర్హులుగా తేల్చి ఆయా కుటుంబాల్లో

మిగతా 8వ పేజీలో...

పంపిణీకి ఏర్పాట్లు ముమ్మరం



రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ కార్డులను 25వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో పంపిణీ చేయనున్నారు. ఏ రోజు ఏయే మండలాల్లో రేషన్ కార్డులు పంపిణీ చేయాలనే విషయమై జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఉమ్మడి జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో చర్చించి షెడ్యూల్ ఖరారు చేయనున్నట్లు సమాచారం. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జరిగే రేషన్ కార్డుల పంపిణీలో ఎక్కడో ఒకచోట ఇన్‌చార్జి మంత్రి పాల్గొననున్నారు. అలాగే మండల కేంద్రాల్లో జరగనున్న కార్డుల పంపిణీ కార్యక్రమంలో సంబంధిత నియోజకవర్గం ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోల్లో ఒకరైనా హాజరయ్యేలా షెడ్యూల్ ఖరారు చేయనున్నారు. రేషన్ కార్డుల పంపిణీతో పాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో ప్రత్యేకాధికారిని నియమించి పర్యవేక్షించనున్నారు.

సంతోషంగా ఉంది



నాకు వివాహమై ఐదేళ్లు పూర్తయింది. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదల పరిస్థితి అర్థం చేసుకొని కొత్త కార్డులు పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. ప్రతీ పేదవాడు కార్డును ఆస్తిగా భావిస్తాడు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కార్డుతో పాటు సన్న బియ్యం ఇస్తున్నందుకు ధన్యవాదాలు.

-మల్లేశం, కోటమర్పల్లి, మర్పల్లి మండలం

శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య



యాలాల, జూలై 21, (ఆంధ్రజ్యోతి): నేటి(మంగళవారం) నుంచి 23, 24వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి సామాజిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య పేర్కొన్నారు. సోమవారం మల్కయ్య విలేకరులతో మాట్లాడుతూ సామాజిక అంతరాలను కుల వివక్షతను, అంటరానితనాన్ని నిర్మూలించడం కోసం కేవీపీఎస్ పనిచేస్తుందన్నారు. దేశ సామాజిక, ఆర్థిక రాజకీయ భౌగోళిక అంశాలపై అవగాహన కల్పించడం కోసం సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తుందన్నారు. నేడు(మంగళవారం), 23, 24వ తేదీల్లో సూర్యాపేట పట్టణంలో జరిగే తరగతులను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

తాగునీటికి తండ్లాట!



వ్యవసాయ బావి నుంచి బిందెలతో నీరు తెచ్చుకుంటున్న మహిళలు

తొమ్మిది నెలలుగా తప్పని అరిగోస

- నిలిచిన మిషన్ భగీరథ తాగునీటి సరఫరా
- ఎండుతున్న తిమ్మాపూర్ తండా ప్రజల గొంతు
- తప్పక బోరు బావులను ఆశ్రయిస్తున్న మహిళలు, చిన్నారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు
- డీజిల్ పేరుతో వార్డు నీటి ట్యాంకర్‌కు పైసల్ వసూలు చేస్తున్న సిబ్బంది

మూడుచింతలపల్లి, జూలై21(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాలు మున్సిపాలిటీల్లో కలిస్తే కష్టాలు తీరుతాయనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. సమస్యలను పట్టించుకోవాల్సిన అధికారులు కాలక్షేపం చేస్తుండడంతో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని లక్ష్మాపూర్ తండాకు గత తొమ్మిది నెలలుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచింది. దీంతో తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిందెడు నీటి కోసం నిత్యం కిలోమీటరు మేర నడుచుకుంటూ వెళ్లి వ్యవసాయ బావుల వద్ద తెచ్చుకోవాల్సిన పరిస్థితి. లక్ష్మాపూర్ తాండలో మెత్తం 45 కుటుంబాలు 420 మంది జనాభా ఉన్నారు. ఇక్కడ పూర్తిగా వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్మాపూర్ తాండకు మిషన్ భగీరథ నీరు సరఫరా నలిచిపోవడంతో తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో

మిగతా 8వ పేజీలో...

గుక్కెడు నీరు దొరకడం లేదు



తండాకు తొమ్మిది నెలలు క్రితం మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచింది. అప్పటి నుంచి తాగేందుకు గుక్కెడు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. రోజూ కిలోమీటర్ మేర నడిచి వెళ్లి వ్యవసాయ బావుల వద్ద నుంచి నీరు తెచ్చుకుంటున్నాం. అధికారులు పట్టించుకోవం లేదు.

-లకావత్ విజ్జమ్మ, లక్ష్మాపూర్ తండా

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్

ధారూరు, జూలై21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు అన్ని అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న రెండు, మూడు రోజుల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ప్రజలు చెట్ల కింద, పాత భవనాల సమీపంలో నిలబడకూడదన్నారు. పాతబడిన, శిథిలావస్థలో ఉన్న మిద్దెలను గుర్తించి అందులో నివసించే కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. దోమలు, ఈగల వల్ల వ్యాధులు ప్రబలకుండ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పంట నష్టానికి సంబంధించి వెంటనే నివేదికలు సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. విద్యుత్ అధికారులు పాతబడిన, కుంగిపోయిన విద్యుత్ స్తంభాలను మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు

మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, జూలై 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు ఉన్నాయని కలెక్టరు మను చౌదరి తెలిపారు. ఎరువుల దుకాణాల్లో ఎంత స్టాక్ ఉందో నోటీసు బోర్డులు పెట్టిస్తున్నామన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అలాగే కొత్త రేషన్ కార్డుల పంపిణీకి అంతా సిద్ధం చేశామని 25వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ, డీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి, సీపీఓ శేఖర్, డీఏవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



వ్యాధుల కాలం..

టీకాలతో దూరం

వానాకాలంలో పలు వ్యాధులు సక్రమించే అవకాశం

రావులపల్లి పశువైద్యాధికారి పరమేశ్వర్

6

కాక్రవేణి నది నుంచి

ఇసుక తోడొద్దు

నది పరీవాహక పొలాల రైతుల నిరసన

దంచికొట్టిన వాన

తాండూరులో 83.3 మి.మీ. వర్షపాతం నమోదు

- ఉరుములు, మెరుపులతో జోరు వర్షం
- పలుచోట్ల నిలిచిన విద్యుత్ సరఫరా



పరిగి పట్టణంలో పారుతున్న వరద నీరు

వికారాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వికారాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తాండూరు, వికారాబాద్‌లో కుండపోతగా వాన పడింది. యాలాల్, పూడూరు, మర్పల్లి, పెద్దేముల్, పరిగి మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో వాగులు, వంకల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. సోమవారం రాత్రి 10 గంటల వరకు జిల్లాలో అత్యధికంగా తాండూరులో 83.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. పూడూరులో 47.3 మి.మీ., యాలాల్ ఏఆర్ఎస్ స్టేషన్‌లో 40.8 మి.మీ., వికారాబాద్‌లో 31.5 మి.మీ., పెద్దేముల్‌లో 27.0 మి.మీ., మర్పల్లిలో 25.3 మి.మీ., కొడంగల్‌లో 16.8 మి.మీ. వర్షం కురిసింది. నవాబ్‌పేట్‌లో 6.5 మి.మీ., బంట్వారంలో 5.5 మి.మీ., ధారూరులో 5.0 మి.మీ., బషీరాబాద్‌లో 3.5 మి.మీ., కోట్‌పల్లిలో 3.0 మి.మీ., బొంరాస్‌పేట్‌లో 1.0 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపులతో కురిసిన ఈ వర్షానికి పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కురుస్తున్న వర్షంతో వెంటనే విద్యుత్ పునరుద్ధరించేందుకు అవకాశం లేకపోవడంతో ప్రజలు చీకట్లోనే గడపాల్సి వచ్చింది.

అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలి



వినతి పత్రం అందజేస్తున్న ఏనుగు సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తాలో హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై అండర్‌పాస్ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం జాతీయ రహదారుల శాఖ రీజనల్ డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎంపీల సహకారంతో కేంద్రంలోని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి సమస్యను వివరించడంతో అండర్ పాస్‌ను మంజూరు చేసినట్లు వివరించారు. ఇప్పటికే పనుల్లో తీవ్రజాప్యం జరిగినందున వెంటనే పనులను చేపట్టాలని ఆయన కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



మృతుడు వెంకటేశ్(ఫైల్)

తాండూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన తాండూరు మండలం మల్కాపూర్‌లో చోటు చేసుకుంది. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్‌నకు చెందిన రెడ్డిపల్లి వెంకటేశ్(32) నాపరాతి గనిలో కూలిపనులు చేసుకుంటుండేవాడు. 11ఏళ్ల క్రితం కొత్లాపూర్‌న కు చెందిన చెవిటి పండరి కూతురు జయశ్రీతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. అయితే జయశ్రీ.. భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి గొచ్చి కొన్ని రోజులు భర్తతో బాగానే ఉంది. ఆదివారం బోనాల పండుగ కోసం జయశ్రీ తండ్రి పండరి మల్కాపూర్‌నకు వచ్చాడు. రాత్రి భోజనాల నంతరం అందరూ నిద్రపోయారు. ఏమైందోగానీ తెల్లారేసరికి వెంకటేశ్ నిద్రించిన స్థలంలోనే నిర్జీవంగా పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న అతడి సోదరుడు శ్రీనివాస్ చిన్న మ్మ కిష్టమ్మకు సమాచారమిచ్చాడు. వారు గ్రామస్తులతో కలిసి పోలీసులకు సమాచారమిచ్చారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేశ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టు మార్టం చేయించారు. గ్రామస్తులు, కుటుంబీల నుంచి వివరాలు సేకరించారు. వెంకటేశ్ తల్లి అంజిలమ్మ, సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ సన్నాహక సభకు తరలిన దివ్యాంగులు



సభకు వెళ్తున్న దివ్యాంగులు

కేశంపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, చేయూత పింఛన్ కోసం ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీ గార్డెన్‌లో సోమవారం జరిగిన జిల్లా సన్నాహక సభకు కేశంపేట మండల పరిధిలోని దివ్యాంగులు తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, గీత, నేత, బీడీ కార్మికుల పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ జిల్లా సన్నాహక సభ నిర్వహించారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చిర్ర శ్రీను ఆధ్వర్యంలో తరలివెళ్లారు. మంద కృష్ణ మాదిగ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం పింఛన్ల పెంపు ప్రకటన చేసిందని తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం పింఛన్లు పెంచలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్నాహక సభకు తరలిన వారిలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు యాదమ్మ, మండలాధ్యక్షుడు మైసయ్య, యాదయ్య, రమేష్, మల్లేష్, మహేందర్ ఉన్నారు.

ఒకరి నేత్ర దానంతో ఇద్దరికి చూపు



శిబిరంలో మహిళ కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఆమనగల్లు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఒకరి నేత్ర దానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ అర్థం మనోహర్ అన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం జిల్లా అంధత్వ నివారణసంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 54 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 22 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ఐఓఎల్ ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోవర్దన్‌రెడ్డి, కార్యదర్శి గంప శ్రీనివాస్, జిల్లా చైర్మన్ నటరాజ్ యాదయ్య కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్, కొరివి వెంకటయ్య, కర్నాటి కొండల్‌రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్ రెడ్డి, పీఆర్‌వో ఎం.ఏ పాషా తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



మతిస్థిమితం లేని వ్యక్తికి స్నానం చేయిస్తున్న బాల్‌రాజు

ఆదిభట్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): నిస్సహాయ స్థితిలో ఉన్న మతిస్థిమితం లేని వ్యక్తిని పోలీసులు చేరదీశారు. స్నానం చేయించి ఆశ్రమంలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు ఆదిభట్ల పోలీసులు. స్టేషన్ పరిధిలోని వండర్ లా సమీపంలో ఓ వ్యక్తి మతిస్థిమితం లేకుండా తిరుగుతుండంతో డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ బాల్‌రాజు, కానిస్టేబుల్ శివాజీ అతడిని చేరదీసి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి స్నానం చేయించారు. అనంతరం కొత్త దుస్తులు కొనిచ్చి నాదర్గుల్ మాతృదేవోభవ ఆశ్రమంలో చేర్పించారు. మానవత్వం చాటుకున్న పోలీసు సిబ్బందిని సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది అభినందించారు.

వ్యాధుల కాలం.. టీకాలతో దూరం





పరమేశ్వర్, పశువైద్యుడు, రావులపల్లి వెటర్నరీ ఆస్పత్రి

కొడంగల్ రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పశువులు వివిధ వ్యాధుల బారిన పడకుండా సకాలంలో టీకాలు వేయించాలని రావులపల్లి పశువైద్యాధికారి పరమేశ్వర్ తెలిపారు. వీటితో పశువుల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. వైరస్‌లు, బ్యాక్టీరియా, ప్రోటోజోవాల ద్వారా వచ్చే వ్యాధుల నుంచి పశువులను వ్యాక్సీన్లు రక్షిస్తాయని చెప్పారు. టీకాలు వేయకుంటే వానకాలంలో వివిధ జబ్బులు సోకే ప్రమాదముందని, పశువ్యాధులు, నివారణ చర్యల గురించి ఆయన ఆంధ్రజ్యోతికి వివరించారు.

గొంతువాపు

దీనినే గురక లేదా కంఠ వ్యాధి అంటారు. వ్యాధి కారక సూక్ష్మక్రిమి పాస్ట్యురెల్లా మాల్టోసిడ వర్షాలతో యాక్టివై పశువుకు సంక్రమిస్తుంది. పశువులకు రైతులు ముందస్తుగా వ్యాధి నివారణ టీకా తప్పక వేయించాలి.

గాలికుంటు వ్యాధి

దీనినే గాళ్లు అంటారు. అఫ్టస్ జాతికి చెందిన సూక్ష్మక్రిమి వల్ల వస్తుంది. అగస్టు, సెప్టెంబరు, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎక్కువగా సోకుతుంది. అగస్టు నెలకు ముందుగానే టీకాలు వేయించాలి.

పీపీఆర్(పారుడు)

ఈ వ్యాధి మార్బిలి జాతికి చెందిన వైరస్‌తో మేకలు, గొర్రెలకు వస్తుంది. పారుడు రోగం సోకిన జీవాల్లో మరణాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. నాలుగు నెలలు నిండిన మేక లేదా గొర్రె పిల్లలకు పీపీఆర్ టీకా ఇవ్వాలి. దీనిని ఏటా జనవరిలో ఇవ్వాల్సి ఉంటుంది.

జబ్బువాపు

దీనని నల్లజబ్బ వ్యాధి అంటారు. వ్యాధి కారక సూక్ష్మక్రిమి క్లాస్ట్రిడియం చౌవై. ఇది సోకితే పశువు నీరసిస్తుంది. మేత మేయదు. జోరు వర్షాలకు ముందే పశులన్నింటికీ టీకాలు వేయించాలి.



పెచ్చులూడిన పాఠశాల పాత భవనం పైకప్పు

శిథిలావస్థకు పాఠశాల పాత భవనం

దుద్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని పోలెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెగడ్డ ప్రాథమిక పాఠశాల పాత భవనం స్లాబ్‌పై కప్పు సిమెంట్ పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు వ్యక్తం చేస్తున్నారు. అయితే మరొక తరగతి గది ఉండగా ఆ గదికి ఉన్న కిటికీలకు తలుపులు లేక పరదాలు కట్టారు. పాత భవనాన్ని కూల్చితే విద్యార్థులు ఆడుకునేందుకు అనువుగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తరగతి గదికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



కిటికీకి కట్టిన పరదా

కాక్రవేణి నది నుంచి ఇసుక తోడొద్దు

● రైతుల నిరసన



విశ్వనాథ్‌పూర్ సమీప కాక్రవేణి నది ఒడ్డున రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

యాలాల, జూలై21(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కాక్రవేణి నది నుంచి ఇసుక తరలింపునకు అధికారులు పర్మిట్లు ఇవ్వొద్దని నదీ పరివాహక పొలాల రైతులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం విశ్వనాథ్‌పూర్ కాక్రవేణి నది ఒడ్డున రైతులు బైఠాయించారు. రైతులు మాట్లాడుతూ.. కాక్రవేణి నది నుంచి ఇష్టానుసారం ఇసుక తవ్వితే నది నీరు లోతులోకి పోతోందని, నది పక్కనుండే యాలాల, గోవిందరావుపేట్, విశ్వనాథ్‌పూర్ గ్రామాల పొలాల్లోని బోర్లు వట్టి పోతాయని అన్నారు. ఇప్పటికే నీరు లోతుకు పడిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఇష్టమొచ్చినట్టు ఇసుక అనుమతులిస్తుండడంతో రోజూ ట్రాక్టర్లలో వందల టన్నుల ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన రెండు నెలలు గడుస్తున్నా నదిలో నీరు చేరలేదని పేర్కొన్నారు. యాలాల, విశ్వనాథ్‌పూర్, గోవిందరావుపేట్ ప్రాంతాల్లోని కాక్రవేణి నదిలో ఇసుక పర్మిట్లు ఇవ్వొద్దని రైతులు తేల్చి చెప్పారు.

వైభవంగా సామూహిక రుద్రాభిషేకం

● నేడు ముగియనున్న శివ పురాణం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దంపతులు



మాట్లాడుతున్న మదన్ మోహన్‌స్వామి

తాండూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాజస్థానీ మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మహా శివ పురాణం' కార్యక్రమం కొనసాగుతోంది. తాండూరులోని గగ్రాని హాల్‌లో సోమవారం రాజస్థానీయుల ఆచారం ప్రకారంగా సామూహిక రుద్రాభిషేకంలో 21 జంటలు పాల్గొన్నాయి. తాండూరు పట్టణం, గుల్బర్గా, యాద్గిర్, గుర్మిట్కల్, మహబూబ్‌నగర్, హైదరాబ్ ప్రాంతాల నుంచి మార్వాడీ మహిళలు, యువమంచ్ ప్రతినిధులు హాజరయ్యారు. జైపూర్ పండితులు మదన్ మోహిన్‌స్వామి చేసిన ప్రవచనాలు ఆకట్టుకున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు కిరణ్ మన్మోహన్ సార్దా, కార్యదర్శి వర్షకైలాస్ సార్దా, కోశాధికారి కల్పన ఆనంద్ రాఠీ, హేమగోవింద్‌సోని, వైజయంతి, భగవాన్‌దాస్ బూబ్, రాధికా, రీతు సోని, ముఖ్య నిర్వాహకులు రాంబగస్, లాల్‌సోని, కుంజ్ బిహరి సోని, దీపక్ గగ్రాని, సంజయ్ సోని, మన్మోహన్ అగర్వాల్, మురళీధర్ గగ్రాని, రాజేష్ సోని తదితరులు పాల్గొన్నారు.

భారీ చోరీలు.. పోలీసులకు చిక్కని దొంగలు

● డివిజన్ పరిధిలో ఛేదించని కేసులు



దొంగతనం జరిగిన ఇంటి వద్ద విచారిస్తున్న పోలీసులు(ఫైల్)

తాండూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): దొంగతనాలు చేస్తూ ఆధారాలు లభించకుండా దొంగలు పోలీసులకు సవాల్ విసుతున్నారు. తాండూరు డివిజన్ పరిధిలో భారీ చోరీ కేసులు మూడు నెలలు దాటినా కొలిక్కి రాలేదు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకొచ్చినా నెలల తరబడి దొంగతనాల మిస్టరీ విడకపోవడంపై బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఫిబ్రవరి 8న తాండూరులోని బృందావన్ కాలనీలోని బస్వరాజ్ ఇంట్లో 16 తులాల బంగారం, రూ.5లక్షలు దోచారు. అంతకుముందు రోజు రాత్రి సాయిపూర్‌లో వెంకట్‌రెడ్డి ఇంట్లో 40తులాల బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకపోయారు. ఏప్రిల్ 12న పెద్దేముల్ మండలం కందనెల్లిలో జంగం చంద్రమౌళి ఇంట్లో దొంగలు చొరబడి ఆరు తులాల బంగా రం, నగదును ఎత్తుకెళ్లారు. అయితే ఈ అన్ని సంఘటనల్లో పోలీసులు క్లూస్ టీమ్‌లు, డాగ్‌స్క్వాడ్స్, ఫింగర్ ప్రింట్ల ఎక్స్‌పర్ట్స్‌తో లభించిన ఆధారాలు సేకరించారు. గౌతాపూర్‌లో గొర్రె ల దొంగలను మాత్రం సీసీ కెమెరాల ద్వారా 48 గంటల్లో ఛేదించారు. అయితే ఇళ్లలో జరిగిన చో రీల విషయంలో మాత్రం నిందితులను గుర్తించలేదు. తమ ఆధారాలు దొరక్కుండా దొంగలు జాగ్రత్తపడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

అదుపులో దొంగల ముఠా?

అర్ధరాత్రిళ్లు దారికాచి వాహనదారులను రాళ్లతో కొడుతూ చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా ఆదివారం తెల్లవారుజామున పట్టబడినట్లు సమాచారం. తాండూరు-కొడంగల్ రోడ్డులో రాళ్లు, కర్రలతో దాడిచేస్తూ లారీలు, ఇతర వాహనదారులను ఈ ముఠా నిలువు దోపిడీ చేస్తున్నట్టు తెలిసింది. కొడంగల్ పోలీసులు ముఘాను పట్టుకున్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఈ ముఠా పట్టుబడడం కలకలం రేపింది. అయితే ఈ ముఠా వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. తాండూరు ప్రాంత ఓ యువకుడు ఈ దారిలో వెళ్తుండగా దారి దోపిడీ విషయాన్ని పసిగట్టి 'డయల్ 100'కు ఫోన్ చేయగా కొడంగల్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ముఠాలో ఎంత మంది ఉన్నారు? ఎక్కడెక్కడ చోరీలు చేశారనే వివరాలు తెలియాల్సి ఉంది.



మాట్లాడుతున్న రమేష్

నాయీ బ్రాహ్మణులకు న్యాయం చేయాలి

కందుకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ కులవృత్తిని దెబ్బతీసే ఆర్టికల్ 19ని వెంటనే రద్దు చేసి న్యాయం చేయాలని ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నాయీ బ్రాహ్మణేతరులు సెలూన్ షాపులు పెట్టుకుంటే తమకు అన్యాయం జరుగుతోందని, ఉపాధి కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు కృష్ణ, శివకుమార్, రాజు, విష్ణు, మహేందర్, కృష్ణ, గణేష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో నిత్యం ఇబ్బందులు

● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆలూర్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై గుంతలో దిగబడిన కారు

చేవెళ్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారుల పట్టింపులు లేకపోవడంతో చేవెళ్ల మండలంలోని ఆలూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. నిత్యం ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్- బీజాపూర్ రోడ్డు నుంచి ఆలూర్ గ్రామం మీదుగా దాదాపు 12 కిలోమీటర్ల లింకు రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. ఆలూర్, వెంకన్నగూడ, తల్లారం, దుద్దాగు, తంగేడ్‌పల్లి, మడికట్టుతో శంకర్‌పల్లి మండలంలోని ఆయా గ్రామాలకు కలిపి ప్రధాన రోడ్డు కావడంతో రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అయితే రోడ్డును బాగు చేయాలని పలు మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కురుస్తున్న వర్షాలకు రోడ్డు మరింత అధ్వానంగా మారిందని, వాహనదారులకు చుక్కలు కన్పిస్తున్నాయని పలువురు వాపోతున్నారు. కొత్తవారు గుంతల రోడ్డును చూసి ప్రజాప్రతినిధుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బొజ్జ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆలూర్ రోడ్డుపై ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వానికి, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు.





కల్వర్టు వద్ద కొట్టుకుపోయిన మట్టి

కంకర తేలిన రహదారి

ఆదిభట్ల: ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని చర్లపటేల్‌గూడ నుంచి రాచులూర్ వరకు రోడ్డు పనులు చేపట్టారు. అయితే చర్లపటేల్‌గూడ-కప్పపాహడ్ వరకు 21 ఫీట్ల బీటీ రోడ్డు వేసి ఇరువైపుల మట్టి పోశారు. కురుస్తున్న వర్షానికి బీటి రోడ్డు పక్కన, కల్వర్టుల వద్ద పోసిన మట్టి కొట్టుకపోవడంతో బీటీ రోడ్డు కింద కంకర తెలి ప్రమాదకరంగా మారింది. రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యత పాటించడం లేదని తుర్కగూడ, కప్పపాహడ్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి రోడ్డు పనులను పర్యవేక్షించాలన్నారు.



ప్రయాణికులకు అసౌకర్యం.. మేకలకు ఆవాసం!

● ధారూర్ బస్టాండ్



ధారూరు బస్‌స్టేషన్ అపరిశుభ్రంగా మారి దుర్గంధం వస్తోంది. బస్‌స్టాండ్‌లో ప్రయాణికులు కూర్చోలేకపోతున్నారు. సోమవారం బస్‌స్టాండ్‌లోని బెంచీలపై మేకలు పడుకున్నాయి. బస్‌స్టాండ్ నిర్వహణ లోపంతో మేకలకు ఆవాసంగా మారింది. ప్రయాణ ప్రాంగణంలో రాత్రింబవళ్లు పడుకుంటున్న మేకలు మల, మూత్రాలు విసర్జిస్తూ బస్టాండ్‌ను అపరిశుభ్రం చేస్తున్నాయి. బెంచీలపై మేకలు దర్జాగా సేదదీరుతున్నాయి. బస్ స్టాండ్‌లో వస్తున్న దుర్గంధాన్ని భరించలేక ప్రయాణికులు బస్టాండ్ బయటే ఉంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి మేకల యజమానులతో మాట్లాడి శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

- ధారూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి)

సీఎం రేవంత్‌వి సాహసోపేత నిర్ణయాలు

ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేశ్‌రెడ్డి

కడ్తాల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సోమవారం రాజేశ్‌రెడ్డి సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఈవో స్నేహలత, ఆలయ ఫౌండర్‌ట్రస్టీ రామావత్ సిరోలి పంతూ, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించిందని, విపక్షాల నాయకులు జీర్ణించుకోలేక ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు దిగుతున్నారన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. మైసిగండి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు హీరాసింగ్, జవహర్‌లాల్ నాయక్, చెన్నయ్య, శ్రీను, రమేశ్, ప్రవీణ్, తులసీరామ్‌నాయక్, బాల్‌రాజ్, అరుణ్ తదతరులు పాల్గొన్నారు.



ఆలయంలో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు



కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కాంగ్రెస్‌తోనే సుస్థిర ప్రగతి : ఎమ్మెల్యే

ఆమనగల్లు, జూలై 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనతోనే సుస్థిర, సామాజిక న్యాయం సాధ్యం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కలకొండకు చెందిన వెంకటయ్యగౌడ్, లక్ష్మణ్, రాంజీ, సైదులు తమ అనుచరులతో కలిసి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు స్వాగతించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ జెండా పేదలకు అండ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని, 90 శాతం పదవులను కైవశం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడమే బీఆర్ఎస్ నాయకుల దినచర్య అని ఎద్దేవా చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ బి.కిషన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు హన్మంతరెడ్డి, జగన్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘునాయక్, ఓంప్రకాశ్‌రెడ్డిపాల్గొన్నారు.

కాళికామాతకు
పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

తాండూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాస బోనాల సందర్భంగా సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కాళికా మాత అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రధాన ద్వారం నుంచి ఆలయం వరకు పోతరాజుల విన్యాసాలు, భక్తుల కోలాహలంతో వెళ్లి దేవతకు పట్టు వస్త్రాలను సమర్పించారు.



ఆలయంలోకి పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ పి.బస్వరాజ్, ఎండోమెంట్ అధికారి నరేందర్, యువజన కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్, రాము, ముదిరాజ్ సంఘం యువజన విభాగం అధ్యక్షులు అల్లాపూర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ చైర్‌పర్సన్



కాళికాదేవి అమ్మవారిని దర్శించుకున్న స్వప్నపరిమళ్

తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ సోమవారం కాళికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెవెంట ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్, యువ నాయకులు భాను ప్రసాద్, వెంకట్, రవి తదితరులు ఉన్నారు. రెండో రోజు కాళికాదేవి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి రంగమెక్కే కార్యక్రమంలో భవిష్యవాణిని కనుల పండుగగా నిర్వహించారు. సోమవారం రాత్రి బోనాల పండుగ ముగిసింది.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



కీసరలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర, జూలై 21(ఆంధ్రజ్యోతి): యువత అన్ని రంగాల్లో రాణించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి కీసరలో లిగసీ క్రికెట్ మైదానంలో, గుర్రం శ్రీధర్‌రెడ్డి అధ్వర్యంలో జీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేదీ వరకు జరిగే క్రికెట్ టోర్నమెంట్‌లో యువత పాల్గొని తమ ప్రతిభను కనబర్చాలన్నారు. ముగింపు ఉత్సవాల్లో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తానని తెలిపారు. నిర్వాహకుడు గుర్రం శ్రీధర్‌రెడ్డిని ఆయన అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

చౌడాపూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వాల్యానాయక్ తండాలో సీసీ రోడ్లను సోమవారం ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్‌కార్డుల ప్రొసీడింగ్స్‌ను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, వెంకటయ్యగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నాగరాజు, శేఖర్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అప్తాల్మిక్ అధికారి హరినాథ్ నెహ్రూ సోమవారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్ క్లబ్ కొడంగల్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

పార్కు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పార్కు స్థలం కబ్జా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కొర్రెముల లక్ష్మీనగర్ కాలనీవాసులు సోమవారం ఆందోళన చేశారు. పోచారం మున్సిపాలిటీ కొర్రెముల పరిధి సర్వే నంబర్లు 747, 750లలో జమాల్‌దుద్దీన్ 1982లో లక్ష్మీనగర్ పేరుతో వెంచర్ చేసి అందులో 1,542 గజాల స్థలాన్ని పార్కు కోసం వదిలారని తెలిపారు. ఇటీవల హైడ్రా అధికారులు ఆ పార్కు స్థలాన్ని పరరక్షించాలని బోర్డు సైతం ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేసి మొక్కలు నాటారు. పార్కు స్థలంలోని 433 గజాల్లో కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టేందుకు పనులు చేస్తున్నారని తెలిపారు. పార్కు స్థలాన్ని కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్న



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా సర్వే నంబర్లు 747, 750లలోని లక్ష్మీనగర్ కాలనీ లేఅవుట్‌లో 433గజాల ప్లాటును కొన్నామని లక్ష్మి అనే మహిళ తెలిపారు. కబ్జా చేయలేదని, ప్రభుత్వ అనుమతితోనే ప్రహరీ నిర్మాణం చేపడుతున్నట్టు ఆమె వివరించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

వికారాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో ఇంజినీరింగ్ చదువుతున్న అమ్మాయిపై హత్యాచార ఘటన దారుణమని, దీన్ని సభ్య సమాజం ఖండించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీష్‌రావు అన్నారు. వికారాబాద్‌లో సోమవారం నిందితుడి దిష్టిబొమ్మను ఏబీవీపీ నాయకులు దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శరత్, సాయిచరణ్, అరవింద్, మంజునాథ్, మనీష్, విఘ్నేష్, రామకృష్ణ, ప్రవీణ్, తులసి రామ్, పురుషోత్తం, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మినీ ఇండియా.. కొత్తూర్

- వివిధ రాష్ట్రాల సాంస్కృతిక సమ్మేళనంగా విలసిల్లుతున్న ఇండస్ట్రియల్ కారిడార్

కొత్తూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం వలసలొచ్చిన వివిధ రాష్ట్రాలకు చెందిన వేలాది మందితో కొత్తూర్ పారిశ్రామిక ప్రాంతం మినీ ఇండియాగా పేరొందింది. దశాబ్దాల కింద వచ్చి పరిశ్రమల్లో పనిచేస్తూ ఇక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. పనిలో పనిగా తెలుగు భాషపై పట్టు సాధించి స్పష్టంగా మాట్లాడుతున్నారు. వివిధ రాష్ట్రాల సంస్కృతులు, పండుగలు ఇక్కడ కన్పిస్తాయి. స్థానిక ప్రజల తో మమేకమై అన్నదమ్ముల్లా కలిసి ఉంటున్నారు. కొందరు కిరాయి ఇళ్లలో నివసిస్తుండగా, మరికొందరు సొంత ఇళ్లు నిర్మించుకున్నారు. వచ్చిన జీతాలు సరిపోకుంటే వారి రాష్ట్రాల్లో ఉన్న ఆస్తులమ్మి వచ్చిన డబ్బుతో ప్లాట్లు కొని ఇండ్లు కట్టు



కొత్తూర్ మున్సిపాలిటీ

కున్నారు. వారి పెళ్లిళ్లు సొంత ప్రాంతాల్లో జరిగినా సంతానం ఇక్కడే జన్మిస్తుండడంతో పిల్లలు తెలుగు భాషను స్పష్టంగా నేర్చుకుంటున్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలో ఐదు వందలకుపైగా ఇతర రాష్ట్రాల కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. అలాగే తీగాపూర్, పెంజర్ల, పారిశ్రామికవాడ, నందిగామ మండలంలోనూ వలస కార్మిక కుటుంబాలు ఉంటున్నాయి. ఏటా వారి వారి సంస్కృతికి సంబంధించిన పండుగలను వైభవంగా జరుపుకుంటున్నారు. బిహారీలు దీపావళి అనంతరం ఛత్ పూజను నిర్వహిస్తారు. ఇలా యూపీ, ఒడిశా, తమిళనాడు, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర ఉత్తరదక్షిణ రాష్ట్రాల ప్రజలు వారి సంప్రదాయ పండుగలను సామూహికంగా జరుపుకుంటారు.



ఛత్ పూజలో పాల్గొన్న ఆయా రాష్ట్రాల ప్రజలు, స్థానికులు(ఫైల్)

కొత్తూర్ పారిశ్రామికవాడ ఏర్పాటుతో...

1976లో కొత్తూర్ ప్రభుత్వం కొత్తూరు ప్రాంతంలో పారిశ్రామికవాడను ఏర్పాటు చేసింది. క్రమంగా తీగాపూర్, పెంజర్ల గ్రామాల్లో, కొత్తగా ఏర్పాటైన నందిగామ మండలంలోనూ భారీ పరిశ్రమలు ఉన్నాయి. వీటిల్లో 20వేలకు పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. తెలంగాణ, ఏపీ, బిహార్, యూపీ, ఎంపీ, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, ఉత్తరాఖండ్, బెంగాల్, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల కార్మికులు ఫ్యాక్టరీల్లో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇతర రాష్ట్రాల కార్మికులకు ఇక్కడి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. రేషన్/అధార్ కార్డులు, పింఛన్ పథకాలు పొందుతున్నారు.

ఇక్కడి ప్రజలు ప్రేమకు ప్రతిరూపాలు



ఇక్కడి ప్రజలు ఎంతో ప్రేమ పంచుతారు. 15ఏళ్ల కింద మేం కొత్తూర్‌కు వలసొచ్చి కార్మికులుగా పనిచేస్తున్నాం. మా పండుగలతో పాటు, తెలుగు పండుగలను సైతం జరపుకుంటాం. ఇక్కడి వాతావరణంతో మేం కలిసిపోయాం.

-అరుణ్‌కుమార్‌సింగ్, నారాయణగూడ కాలనీ

తెలుగు ప్రజలతో కలిసిపోయాం



15ఏళ్ల క్రితం నా భర్తతో కలిసి బిహార్ నుంచి వలసొచ్చాం. నా భర్త కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నారాయణగూడ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. తెలుగుభాష నేర్చుకున్నాం. ఇక్కడి వారితో కలిసుంటాం.

- ధన్‌మంతిదేవి, గృహిణి, బిహార్

మాలో ఒకరిలా చూసుకుంటున్నాం



దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అనేక మంది కార్మిక కుటుంబాలు నారాయణగూడ కాలనీలోనే ఎక్కువగా నివాసం ఉంటున్నాయి. వారికి సమస్యలొచ్చినప్పుడు మేం అండగా నిలుస్తూ మాలో ఒకరిలా చూసుకుంటున్నాం. నిరుపేద కార్మిక కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషిచేస్తున్నాం.

- కమ్మరి జయమ్మజనార్ధన్‌చారి, కౌన్సిలర్, నారాయణగూడ కాలనీ

కష్ట, సుఖాల్లో తోడుంటున్నాం



ఇతర రాష్ట్రాల నుంచి వలసొచ్చి కొత్తూర్ మున్సిపాలిటీలో నివాసం ఉంటున్న కార్మికుల కుటుంబాల కష్ట, సుఖాల్లో పాలుపంచుకుంటున్నాం. వారి వారి సంస్కృతీ సంప్రదాయ వేడుకల్లో పాల్గొంటూ వారితో మమేకమవుతున్నాం. వలసొచ్చిన వారికి సామాజికంగా, లేదా కుటుంబాల పరంగా ఏ మైనా సమస్యలొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

- బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్, చైర్ పర్సన్, కొత్తూర్ మున్సిపాలిటీ

మహిళల ఆర్థికాభివృద్ధికి సర్కార్ కృషి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మహిళా సంఘాలకు రుణాల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, డీఆర్డీవో శ్రీలత తదిత

ఇబ్రహీంపట్నం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందనే ఉద్దేశ్యంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తగు కార్యాచరణతో ముందుకు పోతోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మంచాల, యాచారం మండలాలకు చెందిన 3,672మహిళా సంఘాలకు రూ. 3.93కోట్లు రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ప్రమాద బీమా, లోన్ బీమా కింద 23మందికి రూ.39లక్షల చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేసేందుకు వ్యాపార రుణాలు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులకు ప్రభుత్వం అవకాశం కలిస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను ఓటు బ్యాంకుగానే చూసిందని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. డీఆర్డీవో శ్రీలత మాట్లాడుతూ.. మహిళల్లో మరింత చైతన్యం తెచ్చేలా ఇందిరా మహిళా శక్తి సంబరాలు జరుపుతున్నామన్నారు. గత ఏప్రిల్ నుంచి స్వయం సహాయక సంఘాల్లో మహిళలకు బీమా కల్పిస్తున్నట్టు తెలిపారు. సంఘాల్లోని మహిళ ప్రమాదవశాత్తూ మరణిస్తే కుటుంబానికి పది లక్షల బీమా అందుతుందన్నారు. రుణంకూడా మాఫీ అవుతుందని చెప్పారు. రెండు లక్షల సబ్సిడీతో పౌల్ట్రీకి రుణాలు ఇస్తున్నామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులనుకూడా మహిళా సంఘాలే చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్లు చిలుక మధుసూదన్‌రెడ్డి, కె.గురునాథ్ రెడ్డి, వైస్‌చైర్మన్ కరుణాకర్, ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ పాండురంగారెడ్డి, ఎంపీడీవోలు జంగయ్య గౌడ్, శ్రీవాణి, బాలశంకర్, రాధారాణి, ఏపీఎంలు రవీందర్, సాంబశివుడు, శోభ, నరేందర్‌రెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు నిర్మల, సుమలత, లత, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని నెర్రెపల్లి, పోచారం, ఎలిమినేడు, కప్పాడు, తుర్కగూడ, చెర్లపటేల్‌గూడ, కర్నంగూడ గ్రామాల్లో రూ.1.5కోట్లతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నెర్రెపల్లిలో డీఆర్డీవో శ్రీలతతో కలిసి ఆయన వన మహోత్సవం లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో తిరుపతిచారి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు
అందుబాటులో ఉంచాలి



ఆగ్రోస్ షాపును తనిఖీచేసిన ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు

కులకచర్ల, జూలై21(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరం మేరకు ఎరువులను అందుబాటులో ఉంచాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. స్థానిక ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు యూరియా సరఫరాలో ఇబ్బందులు కలగకుండా పంపిణీ చేయాలన్నారు. యూరియా దొరకడం లేదనే తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. చాలా మంది రైతులు ముందుగానే ఎరువులు కొని నిల్వ చేసుకున్నారని చెప్పారు. అలా కాకుండా రైతుల అవసరం మేరకు కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్‌నాయక్, వెంకటయ్యగౌడ్, వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఢిల్లీ సమావేశానికి చైర్మన్‌కు ఆహ్వానం



కులకచర్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 25న తల్కటోరా స్టేడియంలో నిర్వహించే ఓబీసీల సమావేశానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులుకు పిలుపొచ్చింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి లేఖ అందింది. బీసీలకు సముచిత స్థానం కల్పనకు భాగస్వామ్యం అయ్యేందుకు అభినందనలు తెలిపారు. ఢిల్లీలో జరిగే ఓబీసీల సమావేశంలో కాంగ్రెస్ జాతీయ స్థాయి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పాల్గొననున్నారు.

టైమింగ్ చార్ట్ తుడిపి వదిలేశారు!

బస్సుల వేళలు తెలియక ఇబ్బందులు



బస్టాండ్‌లో చెరిపేసిన టైమింగ్ చార్ట్

తాండూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): తాండూరు బస్టాండ్‌లో గోడకు రాసిన బస్సులు బయలుదేరు వేళల బోర్డును తుడిపివేశారు. దీన్ని తుడిపేసి వారం రోజులైంది. తిరిగి బస్సులు బస్టాండ్ నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరే టైమింగ్స్ రాయలేదు. ఊర్లపేర్లను ఉంచి టైమింగ్స్ తుడిపేశారు. బస్సు ఏ టైంకు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. టైమింగ్స్ తెలుసుకుందామంటే కంట్రోలర్ కూడా అందుబాటులో ఉండరు. ఉదయం వేళ ప్రయాణికులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. మార్చిన వేళలు, కొత్త సర్వీసుల గురించి రాసేందుకు తుడిపేశారా? మరేదైనా కారణమా తెలియదు. టైమింగ్ చార్ట్ లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే వేళాల బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నేడు ఓంకారేశ్వర
ఆలయంలో రుద్రాభిషేకం



ఓంకారేశ్వర స్వామి ఆలయం

చౌడాపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందిపాల్‌లోని ఓంకారేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం పేర్కొన్నారు. నెల రోజులుగా వరుణ దేవుడు ముఖం చాటేయడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాలు కురవాలని ఆలయంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాల్‌లో మరో సొసైటీ

- డీసీసీబీ అధికారుల ప్రతిపాదన

యాచారం, జూలై 21(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలో మరో సహకార సొసైటీని ఏర్పాటుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. దీనికి మాల్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. రాష్ట్ర సహకార శాఖ అధికారులు, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే మాల్‌లో సొసైటీ ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం యాచారం సొసైటీలో 8,200 మంది సభ్యులున్నారు. కొత్తగా 2,350 మంది సభ్యులతో మాల్‌లో సొసైటీ ఏర్పాటు చేయతలంచారు. కొత్త సొసైటీలో మాల్, మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌడ్, భానుతండా, శ్రీమంతగూడ, కిషన్‌పల్లి, నల్లవెల్లి, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, వేపపురితండా, కొత్తపల్లి తండా, మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి గ్రామాలను చేర్చుతారు. మండలంలోని మిగతా గ్రామాలతో యాచారం సొసైటీ కొనసాగనుంది.



యాచారంలోని సహకార పరపతి సంఘ కార్యాలయం

గతంలో నాలుగున్నా మిగిలింది ఒక్కటే...

2003 వరకు యాచారం, చింతపట్ల, చౌదర్‌పల్లి, గున్‌గల్ సొసైటీలుండేవి. వాటి సంఖ్యను తగ్గించి ప్రతీ మండలానికో సొసైటీ ఏర్పాటు చేశారు. యాచారం సొసైటీ రైతులకు ప్రస్తుతం రూ.5కోట్ల రుణాలిచ్చింది. కొత్త సొసైటీ ఏర్పాటుతో బ్యాంకు సేవలు, రుణ పరపతి మరింత చేరువకానున్నాయి. యాచారం సొసైటీపై పనిభారం తగ్గి పాత బాకీల రికవరీకి సిబ్బందికి మరింత సమయం, వెసులుబాటు ఉంటాయి.

రైతులకు మరిన్ని మెరుగైన సేవలందుతాయి



మాల్‌లో మరో సొసైటీ ఏర్పాటుతో రైతులకు మెరుగైన సేవలందుతాయి. మాల్‌లో సొసైటీ ఏర్పాటుకు డీసీసీబీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కొత్త సొసైటీ ఏర్పాటుకు అనుమతులు రాగానే అక్కడి నుంచే సేవలను ప్రారంభిస్తాం. సొసైటీకి అవసరమైన కార్యాలయాన్ని, సిబ్బందిని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటాం.

- నాగరాజు, సీఈవో, పీఏసీఎస్, యాచారం

రోడ్డుపై గుంతలు పూడ్చరూ?



కాలనీలో సీసీ రోడ్డు గోతుల్లో నిలిచిన వాన నీరు

ఆమనగల్లు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వెంకటేశ్వర కాలనీలో అంతర్గత రోడ్డు గోతులమయమైంది. సీసీ లేచిపోయి మోకాళ్ల లోతు గోతులేర్పడ్డాయి. వర్షాలకు నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆమనగల్లు - షాద్‌నగర్ రహదారిని అనుసరించి కాలనీ మీదుగా హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారికి ఏళ్ల క్రితం సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు నాణ్యత పాటించలేదు. దీనికి తోడు షాద్‌నగర్‌రూట్‌లో రోడ్డు విస్తరించడంతో ఎత్తుపెరిగింది. దీంతో రోడ్డుపై నీరు నిలుస్తోంది. రోడ్డు మరమ్మతు విషయంలో మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారు. గోతుల్లో మట్టికూడ పోయడం లేదు. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



పరిగి పట్టణంలోని ఉపాధ్యాయులు కుందేటి వెంకటయ్య ఇంట్లో ఆదివారం రాత్రి బ్రహ్మకమలం వికసించింది. ఈ పుష్పాలు వికసించడం చాలా అరుదు. కాగా వెంకటయ్య మొక్క నాటిన ఎనిమిదేళ్ల తర్వాత పుష్పాలు వికసించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య దంపతులు పూజలు నిర్వహించారు.

- పరిగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి)

పరిగిలో టీచర్ వెంకటయ్య ఇంట్లో వికసించిన బ్రహ్మకమలాలు

పశువైద్యున్ని నియమించాలి

● తాండూరు పశువైద్యశాల ఎదుట రైతుల ధర్నా

తాండూరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తాండూరు పశువైద్యశాలకు వచ్చే మూగజీవాలకు వైద్యం అందించేందుకు వైద్యులు లేకపోవడంతో వైద్యం అందక మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయని రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం తాండూరు పశువైద్య ఆసుపత్రి ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని మల్‌రెడ్డిపల్లి, పాత తాండూరు, సాయిపూర్ ప్రాంతాలతోపాటు సమీపంలోని గ్రీన్‌సిటీ, కోకట్, గొల్ల చెరువు, చెనిగేష్‌పూర్, కోణాపూర్ తదితర ప్రాంతాల రైతులు తమ పశువులను తాండూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని పశువైద్యశాలకు తీసుకొచ్చి వైద్యం చేయిస్తుంటారు. అయితే ఈ వైద్యశాలలో పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ ఏప్రిల్ నెలలో బదిలీ కావడంతో ఆయన స్థానంలో కొడంగల్‌లో విధులు నిర్వహిస్తున్న పశువైద్యుడు నోవా ఇన్‌చార్జి వైద్యుడిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఇప్పటి వరకు ఆయన విధులకు హాజరు కాలేదు. దీంతో ఆస్పత్రిలో కాంట్రాక్ట్ అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లేశం వైద్యశాలకు వచ్చే వివిధ పశువులకు చికిత్స అందిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడం, వివిధ వ్యాధులకు గురైన పశువులకు వైద్యం అందకపోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఈ విషయంపై ఆంధ్రజ్యోతిలో ఇటీవల 'మూగజీవాలకు అందని వైద్యం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. అయితే, పశువైద్యాధికారి మాత్రం తాండూరు పశువైద్య కేంద్రానికి రావడంలేదు. దీంతో రైతులు ఆందోళనకు బాటపట్టారు. త్వరలో పశు వైద్యున్ని నియమించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో తాండూరు పట్టణంతోపాటు పాత తాండూరుకు చెందిన రైతులు మల్లారెడ్డి, మైపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాములు, వెంకటేశం, అవినాష్, బాలమ్మతోపాటు పలువురు రైతులున్నారు.



తాండూరు పశు వైద్యశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గ్రామాల్లో బోనాల సందడి



వికారాబాద్: బోనాల ఉత్సవాల్లో అమ్మవారి వేషధారణలో చిన్నారి

వికారాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఆషాఢ బోనాల సందడి నెలకొంది. వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లిలో అమ్మవార్లకు మహిళలు పెద్దఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, గ్రామపెద్దలు రత్నారెడ్డి, ముత్యంరెడ్డితో పాటు పలువురు నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బోనమెత్తిన సాయివేద విద్యార్థులు

తాండూరు: తాండూరు శ్రీసాయి మేధ విద్యాలయంలో సోమవారం బోనాల జాతరను చిన్నారులు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. పాఠశాల ఆవరణలో అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించడంతో పాటు, సౌరమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థినులు బోనాలతో అమ్మవార్ల దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి విద్యార్థినులు భక్తి శ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు మంజులరెడ్డి, కల్పన, ప్రిన్సిపాల్ సజిత, వైస్ ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉత్తమ బోనాలు తయారు చేసిన విద్యార్థినులకు పాఠశాల కరస్పాండెంట్ బహుమతులను ప్రదానం చేశారు.





వికారాబాద్: ఎన్నెపల్లిలో బోనాలతో మహిళలు, ఉత్సవాల్లో నాయకులు, గ్రామస్తులు

ఘనంగా తొట్టెల ఊరేగింపు

ఘట్‌కేసర్ రూరల్: బోనాల మరుసటి రోజు నిర్వహించే తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారం డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులు తొట్టెల ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామదేవతలైన నల్లపోచమ్మ, మహాకాళమ్మ ఆలయాల వద్ద అమ్మవార్లకు తొట్టెలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్ సింగారం ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బద్దం కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.





తాండూరు: బోనాలు సమర్పిస్తున్న విద్యార్థినులు, పోతరాజుల విన్యాసాల్లో విద్యార్థులు



ఘట్‌కేసర్ రూరల్: తొట్టెల ఊరేగింపులో భాగంగా పోతరాజులతో కాలనీవాసులు

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

మనోహరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ మండల పరిధిలో సోమవారం ఉదయం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్ గౌడ్ వివరాల ప్రకారం ఏపీలోని అనకాపల్లి జిల్లా చౌడవరం మండలం, బోగపురం గ్రామానికి చెందిన కానుక తేజ(19) మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి గ్రామానికి చెందిన తన స్నేహితుల వద్దకు 20 రోజుల క్రితం వచ్చాడు. ఆదివారం రాత్రి స్నేహితులు ప్రవీణ్, మురళీ, పోరుబిల్లి లోకేష్‌తో కలిసి మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ శివారులోని ఫాంహౌస్‌కు వచ్చాడు. తిరిగి సోమవారం ఉదయం స్కూటీపై గుండ్లపోచంపల్లికి వెళ్తుండగా.. కాళ్లకల్ శివారులోని 44 జాతీయ రహదారి రాఘవేంద్ర హోటల్ వద్ద హైదరాబాద్‌కు వెళ్తున్న కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు స్కూటీని వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న నలుగురు స్నేహితులు కిందపడ్డారు. ఈ ఘటనలో తేజ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన ముగ్గురికి తీవ్రగాయాలు కాగా మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా గుండ్లపోచంపల్లిలో నివాసముంటున్న లోకేష్ గ్రామానికి చెందిన నాగవెంకట అప్పలనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. ఘటనపై అప్పలనాయుడు బాధితుల, మృతుడి కుటుంబీకులకు సమాచారమందించాడు.

బైక్ ఢీకొని వ్యక్తి..

ఘట్‌కేసర్ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీకారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా తుంగతుర్తి మండలం పప్పుల తండాకు చెందిన లీలావత్ రవీందర్(40) నగరంలోని కర్మంఘట్‌లో ఉంటూ కూలీ పనులు చేస్తుంటాడు. రవీందర్ పనినిమిత్తం సోమవారం ఉదయం పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడకు వచ్చాడు. అన్నోజిగూడ, ఆనంద కన్‌స్ట్రక్షన్ ఎదుట రోడ్డు దాటుతుండగా ఉప్పల్‌వైపు వెళ్లుతున్న శ్రీకాంత్ బైక్‌పై వస్తూ రవీందర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవీందర్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు రవీందర్ అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీళ్లపల్లి శ్మశానవాటికలో చోరీ



ఇస్మాయిల్‌పూర్ శ్మశానవాటిక



చోరీకి గురైన రేకులు

బషీరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీళ్లపల్లి క్లస్టర్ పరిధిలోని ఇస్మాయిల్‌పూర్ వద్ద నిర్మించిన శ్మశానవాటికలో చోరీ జరిగింది. ఈ స్మశానవాటిక వాడుకలో లేకపోవడం, ఇస్మాయిల్‌పూర్‌కు చివర అటవీ ప్రాంతం దగ్గర ఉండటంతో రూ.1.25లక్షల విలువైన రెండు సోలార్‌లైట్లు, గదుల పైకప్పురేకులు, సింథటిక్ ట్యాంకు, పైపులు ఇతరత్రా విలువైన సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇనుప గేటును కూడా తొలగించే ప్రయత్నం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిగతా సామగ్రి చోరీకి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ వైకుంఠధామాన్ని ఏడేళ్ల కిందట జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులు రూ.10.25లక్షలు వెచ్చించి నిర్మించారు. అద్దె గదుల్లో జీవనం సాగించే కుటుంబాల్లో ఎవరైనా మృతిచెందితే మృతదేహానికి అంత్యక్రియలతో పాటు 11రోజుల పాటు ఇక్కడే ఉండేందుకు ప్రత్యేక విశ్రాంతిగది, నీటివసతి, ట్యాంకునిర్మాణం వంటివి అప్పట్లో ఏర్పాటు చేశారు.

పరిగి డీసీఎమ్మెస్‌లో..

పరిగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని డీసీఎమ్మెస్ కార్యాలయాలో చోరీ జరిగింది. కార్యాలయానికి తాళంవేసి ఉండగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం విరగ్గొట్టి లోపలికి చొరబడ్డారు. కౌంటర్‌లో ఉన్న రూ.45వేల నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం కార్యాలయానికి వెళ్లిన డీసీఎమ్మెస్ బ్రాంచి మేనేజర్ వెంకటయ్య పరిశీలించగా తాళం విరగ్గొట్టి ఉండగా లోపలికి వెళ్లి చూడగా కౌంటర్‌లో ఉన్న రూ.45వేలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుబడిన దొంగ



చోరీకి యత్నించిన వ్యక్తి

ధారూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మైసమ్మ ఆలయంలో చోరీ చేస్తున్న దొంగను చుట్టుపక్కల పొలాల రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మండలంలోని రుద్రారం, తిమ్మనగర్ గ్రామాల మధ్య అడవి బాటలో ఉన్న బోనమైసమ్మ ఆలయం వద్ద సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి బోన మైసమ్మ ఆలయం తలుపు తెరిచి లోపలికి వెళ్లడాన్ని గమనించిన చుట్టుపక్కల రైతులు అక్కడికి చేరుకుని పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తిని రైతులు ప్రశ్నించగా హిందీలో మాట్లాడటంతో రుద్రారం గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ ఆ వ్యక్తి వద్ద సోదాచేయగా ఆలయాల్లో ఉండే వెండి అమ్మవారి వస్తువులు, వెండి విగ్రహాలు, కళ్లు, చేతులు, ఇతర సామగ్రితో పాటు తాబేలు, బుర్ర, పిట్టలు బయటపడ్డాయి. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా పట్టుబడిన వ్యక్తి పేరు, పూర్తి వివరాలు సక్రమంగా చెప్పడం లేదని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిస్తామని ఎస్‌ఐ రాఘవేందర్ తెలిపారు.

నూతన ఎస్‌ఐలకు సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ధారూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎస్‌ఐ ఎస్. రాఘవేందర్‌ను సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎస్‌ఐకి శాలువా కప్పి మొక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, భీంసేన్, హఫీజ్, చిన్నయ్య గౌడ్, లక్ష్మయ్య, బాల్‌రాజ్ నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఐని సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

బషీరాబాద్: మండల ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్న నుమన్‌ఆలీకి మాజీ ప్రజాప్రతినిధులు, మైనార్టీ నాయకులు పలువురు సోమవారం శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగేంద్రయ్య, మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్ రవీందర్‌సింగ్, డి.నర్సింహులు, మాజీ కోఆప్షన్ సభ్యులు రాజాక్, తహేర్‌బాండ్, మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

బషీరాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు(మంగళవారం) ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే చేతులమీదుగా కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేస్తునట్లు బషీరాబాద్ తహసీల్దార్ షాహిదాబేగం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 276 కార్డులు కొత్తగా వచ్చాయన్నారు. రేషన్‌కార్డులతో పాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులనూ పంపిణీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

24న చౌడేశ్వరి మాత జయంతి ఉత్సవాలు

కొడంగల్ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న కొడంగల్ పట్టణ శివారులోని శ్రీ నందవరం చౌడేశ్వరి మాత జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం ఉదయం 5గంటలకు సుప్రభాతసేవ, 6గంటలకు పంచామృత అభిషేకం, 11 గంటలకు ప్రత్యేక పూజ, 12:30 గంటలకు అన్నదానం, రాత్రి 7గంటలకు భజన ఉంటుందని తెలిపారు. గంటల వరకు కంటివైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతీ వాహనానికి నంబర్ ప్లేట్లు ఉండాలి

పూడూరు, జూలై 21, (ఆంధ్రజ్యోతి): ప్రతీ వాహనానికి నంబర్ ప్లేట్లు ఉండాలని చెన్‌గోముల్ ఎస్‌ఐ భరత్‌కుమార్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై మిర్జాపూర్ గేటు వద్ద ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి సోమవారం నంబర్లు ప్లేట్లు లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.



మిర్జాపూర్ గేటు వద్ద వాహనాలను తనిఖీ చేసి అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ భరత్‌కుమార్‌రెడ్డి

కొత్త రేషన్ కార్డులకు మోక్షం

(ఐదో పేజీ తరువాయి)

నమోదైన 5,214మందిని తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 14,700 రేషన్‌కార్డులు మంజూరు చేయడంతో జిల్లాలో రేషన్‌కార్డుల సంఖ్య 2,55,288కు పెరిగింది. ఈ రేషన్‌కార్డుల్లో 8,62,482 మంది కుటుంబ సభ్యులు నమోదయ్యారు.

మండలాల వారీగా

జిల్లాలో అత్యధికంగా పరిగి నియోజకవర్గానికి 4,779 కొత్త రేషన్ కార్డులు రాగా, తాండూరు నియోజకవర్గానికి 4,699, వికారాబాద్ నియోజకవర్గానికి 2,837, కొడంగల్‌కు 2,280, చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోకి వచ్చే నవాబ్‌పేట మండలానికి 105, బంట్వారం మండలానికి 822, మోమిన్‌పేట్‌కు 129, ధారూరుకు 492, మర్పల్లికి 115, కోట్‌పల్లికి 516, వికారాబాద్‌కు 763 రేషన్ కార్డుల చొప్పున మంజూరయ్యాయి. కులకచర్ల, చౌడాపూర్ మండలాలకు 1,562 రేషన్‌కార్డులు రాగా, దోమకు 1,290, పరిగికి 1,395, పూడూరు మండలానికి 532 కార్డులు మంజూరు చేశారు. బషీరాబాద్ మండలానికి 316 రేషన్ కార్డులు రాగా, పెద్దేముల్‌కు 1,255, తాండూరుకు 2,269, యాలాల్‌కు 859 కార్డుల చొప్పున వచ్చాయి. బొంరాస్‌పేట్, దుద్యాల మండలాలకు 1,452, కొడంగల్‌కు 549, దౌల్తాబాద్‌కు 279 కార్డులు మంజూరయ్యాయి.

నిరంతర ప్రక్రియ

జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవ ద్వారా 23,543 దరఖాస్తులు అధికారులకు వచ్చాయి. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన అధికారులు వాటిలో అర్హులుగా గుర్తించిన 14,700 కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులకు మంజూరు చేశారు. కాగా, రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల్లో ఇంకా కొన్ని విచారణ దశలో ఉన్నాయి. కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులు చెబుతున్నారు. మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించి అర్హులుగా గుర్తించి ఆన్‌లైన్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులకు సిఫారసు చేస్తే వారు ఆమోదిస్తున్నారు. కొత్త రేషన్ కార్డుదారులకు సెప్టెంబర్ నెలలోనే సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. మూడు నెలల కోటా బియ్యం జూన్ నెలలోనే పంపిణీ చేసిన నేపథ్యంలో కొత్త రేషన్‌కార్డుదారులు రేషన్ కోసం మరో 45 రోజులు వేచి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

మేడ్చల్ జిల్లాలో 30 శాతం

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో కొత్త కార్డుల కోసం 93,603 దరఖాస్తులు చేసుకోగా, దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి 28,818 ఆమోదించారు. దాదాపు 30 శాతం మేర నూతన కార్డులకు ఆమోదం తెలిపారు. 64,785 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. రేషన్‌కార్డులో మార్పులు, చేర్పుల కోసం 1,05,823 దరఖాస్తులు రాగా అందులో 79,720 దరఖాస్తులను అధికారులు ఆమోదించారు.

ఇన్నాళ్లు ప్రభుత్వ పథకాలు కోల్పోయాం



రేషన్‌కార్డు లేక ఇన్నాళ్లు ప్రభుత్వ పథకాలను కోల్పోయాం. ఎన్నో సంవత్సరాల నుంచి రేషన్ బియ్యం రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మాకు కొత్తరేషన్‌కార్డు వచ్చింది. మాకు ఎంతగానో ఆనందంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- కొత్త నాగేంద్రమ్మ, బార్వాద్ గ్రామం, కోట్‌పల్లి

తాగునీటికి తండ్లాట!

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నీరు పథకం వృథాగా మారింది. రోజు ప్రైవేటు నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకునేందుకు రూ.1000 చెల్లించే స్థోమత తమకు లేదని వాపోతున్నారు. 100 రోజుల ప్రణాళికలో బిజీగా ఉన్నామని చెప్తున్న మున్సిపల్ కమిషనర్.. ఏవరైనా సమస్యను వారి దృష్టికి తీసుకెళ్తే తాము చేసేది ఏమి లేదని, కారోబార్లను అప్పజెప్పామని వారితోనే మాట్లాడుకోవాలని చెబుతున్నాడని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాండకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని వారం రోజులకొక్కసారి లక్ష్మాపూర్ నుంచి వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. కాగా అందుకు వినియోగించే నీటి ట్యాంకర్ చిలుము పట్టి రంధ్రాలు పడటంతో దారి వెంట నీరు వృథాగా పోతూ లక్ష్మాపూర్ తాండకు చేరుకునే వరకు సగం ట్యాంకర్ ఖాళీ అవుతోంది. అయినా అధికారుల్లో మాత్రం చలనం లేక పోగా ట్యాంకర్‌కు డీజిల్ కావాలని ప్రజల దగ్గరి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు.



బిందెలు పట్టుకుని బావుల వద్దకు వెళ్తున్న చిన్నారులు

కిలోమీటర్ల మేర నడుస్తూ..

చిన్నారులు, పెద్దలు, మహిళలు బిందెలు పట్టుకుని కిలోమీటర్లు కాలినడకన, వాహనాల పైన వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి. వ్యవసాయ బావుల నుంచి తెచ్చుకున్న నీటిని తాగి రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నా సంబంధిత అధికారులు తండా వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇక మిషన్ భగీరథ వాటర్ మన్ గురించి అడిగితే అంతే సంగతులు. ఎందుకంటే తాను ఎప్పుడూ డ్రైజర్ లేదని, చూద్దామని చెబుతుంటాడు. ఈ విషయమై పలు సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోక పోగా బిజీగా ఉన్నామని పారిశుధ్య పనులు జరుగుతున్నాయని చెబుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

త్వరలోనే పరిష్కరిస్తాం



లక్ష్మాపూర్ తండాలో మిషన్ భగీరథనీటి సరఫరా నిలిచిన విషయం మా దృష్టికి వచ్చింది. తండాను సందర్శించి త్వరలోనే నీటి సమస్యను పరిష్కరిస్తాం. ఎవరూ ఆందోళన చెందొద్దు.

- పవన్‌కుమార్, మూడుచింతలపల్లి కమిషనర్

డబ్బులు వసూలు చేస్తున్నారు



లక్ష్మాపూర్ నుంచి తండాకు నీటిని తీసుకువచ్చే ట్యాంకర్ వారు డీజిల్‌కు డబ్బులు కావాలని అడుతున్నారు. వారం రోజులకు ఒక్కసారి నీటి ట్యాంకర్‌ను పంపించి సమస్యను పరిష్కరించామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని త్వరగా నీటి సమస్యను పరిష్కరించాలి.

- భానోత్ అంబాయి, లక్ష్మాపూర్ తండా

చినుకు పడితే చిత్తడే!



తిరుమలవెంచర్ రోడ్డు దుస్థితి

పరిగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని అంతర్గత రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా మారింది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు చిత్తడిగా మారుతున్నాయి. పట్టణంలోని తిరుమలరెసిడెన్సీ, భవానినగర్, వెంకటేశ్వరకాలనీ, తిరుమల హిల్స్ తదితర కాలనీల్లో కాలనీల్లో రోడ్లు వేయకపోవడంతో చిన్నపాటి చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలకు వెళ్లే కల్యాణ్‌నగర్ కాలనీ అధ్వానంగా మారింది. ఆటోలు, టూ వీలర్లు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.




పరిగి: భవానీనగర్‌లో గుంతలమయంగా రోడ్డు



కులకచర్ల: గుంతలమయంగా కల్యాణ్‌నగర్

డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీని రెన్యూవల్ చేయాలి



నిరసన తెలుపుతున్న అతిథి అధ్యాపకులు

కొడంగల్ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయాలని కొడంగల్, కోస్గి, మద్దూర్, పరిగి కళాశాలల అతిథి అధ్యాపకులు రమేష్, మోహన్, కేశవులు అన్నారు. కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు నెలకు రూ.50వేల వేతనం అందించాలన్నారు. ప్రస్తుతం డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న వారిని రెన్యూవల్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రతీ సంవత్సరం పాతవారినే కొనసాగిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు, వెంకటయ్య, శ్రీనివాస్, వెంకట్ రాములు, మణికంఠ, ఈశ్వర్, మాణిక్యప్ప తదితరులు పాల్గొన్నారు.